నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 2 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

నేర్పల్లి సంతోష్(ఫైల్)

సీసీసీ నస్పూర్, జూలై 1: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఉంటున్న నేర్పల్లి సంతోష్(37) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం మార్తాడికి చెందిన సంతోష్ ఎఫ్‌సీఐ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి ముందున్న లైటు ఆఫ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు నేర్పల్లి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నస్పూర్ ఎస్ఐ-2 జితేందర్‌సింగ్ తెలిపారు. కాగా, కొత్త చట్టం (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం) ప్రకారం ఇది మొదటి కేసు అని సీపీ శ్రీనివాస్ తెలిపారు.

శ్రీరాంపూర్ : ఎస్సారెస్పీ-3 మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

1070 ఎకరాలు ధారాదత్తం!

నెన్నెల మండలంలో ప్రభుత్వ భూములకు అక్రమ పట్టాలు జారీ చేసిన తహసీల్దార్లు

- 600 ఎకరాలు ధరణిలో నమోదు.. అక్రమంగా పీవోటీతో పాస్‌బుక్‌లు
- అధికారుల ఎంక్వైరీలో తేలిన లెక్కలు..
- రైతుబంధు డబ్బులతో పాటు రుణాలు పొందినా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- ఆనాడు పిల్స్ వేసేందుకు లాయర్‌ను ఇచ్చింది రేవంత్‌రెడ్డేనంటున్న సామాజిక కార్యకర్త ఇందుర్తి రాంమోహన్‌రావు

మంచిర్యాల, జూలై 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల, గొల్లపల్లి గ్రామాల శివార్లలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు తమ సొంత కష్టార్జితంలా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వెయ్యి ఎకరాల పై చిలుకు ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టా పాస్ బుక్‌లు జారీ చేసి మరీ అప్పగించగా, సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'నెన్నెల గ్రామ శివారులోని 1947 ఎకరాల ప్రభుత్వ భూమిలో 900 ఎకరాలు, గొల్లపల్లి గ్రామ శివారులోని 463 ఎకరాల ప్ర భుత్వ భూమిలో 170 ఎకరాలను ప్రైవేట్ వ్య క్తులకు పట్టాలు చేశారు. వీటికి ఏఆర్‌సీ (అసెంబ్లీ రివ్యూ కమిటీ) అప్రూవల్‌గానీ, అసైన్మెంట్ పట్టాలుగానీ.. లేకపోవడం గమనార్హం. ఈ విషయమై సామాజిక కార్యకర్త ఇందూరి రాం మోహన్‌రావు 2021లో హైకోర్టులో రెండు ప్రజాప్రయోజన వాజ్యలు దాఖలు చేశారు. ఈ అంశంపై అప్పటి కలెక్టర్ భారతీ హోళికేరిని ఎంక్వయిరీ చేసి రిపోర్టు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఆర్డీవో విచారణ చేసి నెన్నెల శివారులోని 79 సర్వే నంబర్‌లో 300 ఎకరాలను ధరణిలో డైరెక్ట్‌గా ఎంట్రీ చేశారని తేల్చారు. 73 సర్వే నంబర్‌లో 200 ఎకరాలు ఇల్లీగల్ పీవోటీ ద్వారా మొత్తం 152 మందికి పట్టాలు జారీ చేసినట్లు నిర్ధారించారు. గొల్లపల్లి శివారుకు సంబంధించి 22 మంది సర్వే నంబర్లు డైరెక్ట్ ఎంట్రీ చేసి, 16 మందికి ఇల్లీగల్ పీవోటీ ద్వా రా 100 ఎకరాలకు పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు ఆర్డీవో గుర్తించారు. దాదాపు 600 ఎకరాలను ధరణిలో నమోదు చేసి పాస్‌బుక్‌లు ఇచ్చారని, వీరి నుంచి రైతుబంధు డబ్బులు వసూలు చేయాలని అప్పటి కలెక్టర్‌కు రిపోర్ట్ చేశారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం

ఆర్డీవో రిపోర్ట్ ఇచ్చినా.. ఆ భూములపై తీసుకున్న రైతుబంధునుగానీ, బ్యాంక్‌లోన్ గానీ రెవెన్యూ అధికారులు, అగ్రికల్చర్ అధికారులు, బ్యాంకు వాళ్లు ఇప్పటి వరకు రికవరీ చేయలేదు. పైగా, వీరికి యేటా రైతుబంధు ద్వారా రూ.60 లక్షలు పడుతుంటే చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారికి రైతుబంధుతో పాటు బ్యాంకు రుణాలు కూడా ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు లక్షలాది రూపాయలు గండి పడుతున్నా చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. నెన్నెల మండలంలో 1987 నుంచి 2018 వరకు తహసీల్దార్లుగా పని చేసిన వారంతా అక్రమ పట్టా పాస్ బుక్‌లు జారీ చేసిన లిస్టులో ఉన్నట్లు ప్రభుత్వ ఎంక్వైరీలోనే తేలింది. ఆదాయ మార్గాలను అన్వేషించడంపై దృష్టి పెట్టిన సర్కారు ఇల్లీగల్ పట్టాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకొని, భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటే కోట్లాది రూపాయలు మిగిలినట్లే కదా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇదే సామాజిక కార్యకర్త రాంమోహన్‌రావు 2017లో హైకోర్టులో పిల్ వేసినప్పుడు అప్పటి కలెక్టర్ ఇదే నెన్నెల మండలంలో 88 మంది అనర్హులకు 207 ఎకరాలకు అక్రమంగా పట్టాలు జారీ చేసినట్లు గుర్తించారు. హైకోర్టు నివేదిక సమర్పించడంతో పాటు పట్టాలను రద్దు చేశారు. ఈ వ్యవహారంలో ఓ అధికారి సహా, ధరణి ఆపరేటర్‌పై చర్యలు తీసుకున్నారు. అనంతరం వేసిన రెండు పిల్స్‌లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే విచారణ జరిగింది. అనంతరం ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. పైగా ఇప్పుడు ఆ 207 ఎకరాల్లోనూ కొందరి పేర్లను మళ్లీ ధరణిలోకి ఎక్కించి రైతుబంధు (రైతు భరోసా) ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పిల్స్ వేయించింది రేవంత్‌రెడ్డే...

నేను ప్రభుత్వ భూముల రక్షణ కోసం పోరాటం చేస్తున్నా. సామాజిక కార్యకర్తగా 2017లో రేవంత్‌రెడ్డి (ప్రస్తుత ముఖ్యమంత్రి)ని కలిశా. నా దగ్గరున్న సమాచారం తెలుసుకున్న ఆయన అడ్వకేట్ టీ. రజినీకాంత్‌రెడ్డి ద్వారా పిల్స్ వేయించారు. అలా 2017లో వేసిన పిల్‌లో 207 ఎకరాల ప్రభుత్వ భూమికి ఇల్లీగల్ పట్టాలు చేసినట్లు తేలింది. 2021లో 1070 ఎకరాలకు సంబంధించి రెండు పిల్స్ వేశాను. కలెక్టర్ విచారణ చేసి రిపోర్ట్ ఇచ్చారు తప్పితే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోలేదు. పైగా 2017లో అక్రమమని గుర్తించిన పట్టాలకు సైతం ఇప్పుడు రైతుబంధు(రైతు భరోసా) ఇస్తున్నారు. ఇదే విషయాన్ని ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్దామంటే దారి దొరకడం లేదు. 2017, 2021లో ఆయన ఇంటి దగ్గరకు వెళ్తే కలిసి మాట్లాడారు. ఇప్పుడు వాళ్ల పీఏని అడిగితే కలవడం వీలుపడదు అంటున్నారు. అడ్వకేట్ రజినీకాంత్‌రెడ్డి ఏమో ఎన్‌వోసీ ఇస్తా అంటున్నారు. నన్ను మధ్యలో వదిలేశారు. నా జీవిత కాలం మొత్తం ఈ భూములకు సంబంధించిన సమాచారం తీయడానికే సరిపోయింది. చేతిలో ఇప్పుడు చిల్లిగవ్వ లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 20 వేల ఎకరాలకు అక్రమంగా జారీ చేసిన పట్టాల వివరాలు నా దగ్గర ఉన్నాయి. సీఎంను కలిసే అవకాశం ఇస్తే అన్నీ వారికి అందజేస్తా. ఈ విషయం ఇప్పటికే బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన పట్టించుకోవడం లేదు. ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో 'నమస్తే తెలంగాణ'ను సంప్రదించా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుకుంటున్నా.

– ఇందుర్తి రాంమోహన్‌రావు, సామాజిక కార్యకర్త

కాసిపేట గనిపై వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు

తాండూర్: ఏరియా వర్క్‌షాప్ వద్ద నిరసన తెలుపుతున్న టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు

గనుల వేలం వద్దే వద్దు

- కార్మికులు, టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్
- గనులు, ఓసీపీలపై నల్ల బ్యాడ్జీలతో నిరసనలు
- సింగరేణి అధికారులకు వినతి పత్రాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు

బొగ్గు గనుల వేలం, ప్రైవేటీకరణ వద్దే వద్దు.. అంటూ కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్‌లపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. అధికారులకు వినతి పత్రాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బొగ్గు బావులను సింగరేణి సంస్థకే అప్పగించాలని, లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

శ్రీరాంపూర్ : ఆర్కే 6పై మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్ : ఇన్‌చార్జి ఎస్ఈ ఈఅండ్ఎం అశోక్‌రెడ్డి వినతి పత్రం ఇస్తూ..

శ్రీరాంపూర్, జూలై 1 : శ్రీరాంపూర్ ఎస్సారెస్పీ-3 గనిపై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి కార్మికులతో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం గనుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానగంటి సత్తయ్యతో కలిసి మేనేజర్ సంతోష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. శ్రీరాంపూర్ ఓసీపీపై టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, ఇన్‌చార్జి సుధాకర్, భాస్కర్‌రావు, లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, ఆర్కే-5గనులపై ఇన్‌చార్జి దుర్గం రవి, ఇందారం ఓసీపీ, గనిపై ఇన్‌చార్జి రత్నాకర్‌రెడ్డి, గోపాల్, రవీందర్ ఆర్కే-7గనిపై రాజూనాయక్, బిరుదు శ్రీనివాస్, ప్రతాప్, ఆర్కే న్యూటెక్ గనిపై ఎండీ లాలా, ఉప్పాల సంపత్, ఎస్సారెస్పీ-1గనిపై గోనె స్వామి, ఆర్కే-6గనిపై కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజర్ అన్వేష్‌రెడ్డి, ముత్యాల రమేశ్, గని ఇన్‌చార్జి గొర్ల సంతోష్, ఎస్సారెస్పీ-3పై ఉత్తేజ్‌రెడ్డి, సాదుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, ఏరియా స్టోర్‌లో ఇన్‌చార్జి ఇసంపెల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్మికులు అధికారులకు వినతి పత్రాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనుల వేలాన్ని నిలిపి వేసి, సింగరేణికే గనులు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి హోదాలో రామగుండానికి వచ్చిన మోదీ గనులను ప్రైవేటీకరించమని, ఆ అధికారం తమకు లేదని స్పష్టం చేశారని గుర్తు చేశారు. తిరిగి చోటేబాయ్ రేవంత్ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గనుల వేలానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో సత్తుపల్లి, కోయగూడెం గనులను వేలంలో పెడితే అడ్డుకున్నామని గుర్తు చేశారు. సింగరేణి శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలంలో పెట్టారని, వెంటనే విరమించు కోవాలని, లేదంటే ఒక్క బొగ్గు పెల్ల కూడా తీయనీయబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, సదానందం, శ్రీనివాస్, రాజేందర్, సందీప్, పీ తిరుపతి, మల్లయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి పవన్, రవి గౌడ్, రఫీఖ్‌ఖాన్, ప్రశాంత్, మధు, కాటం రాజు, భానుచందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జూలై 1 : బెల్లంపల్లి సివిల్ డిపార్ట్‌మెంట్, శాంతిఖని గని ఆవరణలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు వేర్వేరుగా నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారి సతీశ్‌కు వినతిపత్రం అందించారు. టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, సిద్ధంశెట్టి సాజన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రమేశ్ మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు సూరం మల్లేశ్, హనుమంతరావు, అశోక్, విజయ్,వెంకటేశ్, సాయి, ఖాదర్, శ్రీకాంత్, మహేశ్, రాకేశ్, శ్రీనివాస్, భిక్షపతి, నసీరుద్దీన్, సందీప్, సాగర్ పాల్గొన్నారు.

కాసిపేట, జూలై 1 : మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ, కాసిపేట-2 ఇంక్లైన్ గనులపై సోమవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్లకు వినతిపత్రం అందించారు. గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, సారంగపాణి, బైరి శంకర్, రమేశ్, కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

బొగ్గు బ్లాకులను సింగరేణికి ఇవ్వాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. సెంట్రల్ కార్యదర్శి అక్బర్ అలీ, ఇప్పకాయ లింగయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి మల్లేశ్, సలీంద్ర సత్యనారాయణ, తిరుపతి గౌడ్, బియ్యాల వెంకటస్వామి, పిట్ కార్యదర్శులు మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్,జూలై 1: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఆర్కేపీ సీహెచ్‌పీ ఇన్‌చార్జి ఎస్ఈ ఈఅండ్ఎం అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

తాండూర్, జూలై 1 : తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లన్నింటినీ సింగరేణి సంస్థకే కేటాయించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్, స్టోర్స్‌లో కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి వర్క్‌షాప్ ఇంజినీర్ నరేశ్, స్టోర్స్ డీజీఎం శ్రీనివాసరావుకు వినతిపత్రాలు సమర్పించారు. టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీలు రాజేశం, గణపతి, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ రమేశ్, నాయకులు వైకుంఠం, వెంకటస్వామి, చంద్రయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

మందమరి, జూలై 1: మందమర్రి ఏరియాలోని కేకే-5గని, ఏరియా వర్క్‌షాప్‌లలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కేకే 5గని మేనేజర్ అల్లాఉద్దీన్, వర్క్‌షాప్ డీవైపీఎం నాగరాజుకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, టీబీజీకేఎస్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు వీరారెడ్డి, రాజయ్య, రాజలింగు, మల్లేశ్, కృష్ణసాయి, మొగిలి, పోలు సంపత్, లక్ష్మణ్, శ్రీనివాస్, భిల్లా మాధవరెడ్డి, కొండల్‌రావు, గురువయ్య, తోట రాజిరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, రాజేందర్, బబ్బర మల్లేశ్, చక్రపాణి, రియాజ్‌ఆలీ, లింగయ్య, కోబూరి కిరణ్, హైమద్, లక్ష్మీనారాయణ, నగేశ్, మంచాల వెంకటి పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

రెబ్బెన, జూలై 1 : బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఖైర్‌గూడ ఓసీపీ ఇన్‌చార్జి మేనేజర్ మధుసూదన్, గోలేటి సీహెచ్‌పీ డీజీఎం భీంరావుజాడేకు వినతిపత్రాలు అందించారు. బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కేంద్ర కమిటీ సభ్యుడు ఓరం కిరణ్, పిట్ కార్యదర్శులు మెరుగు రమేశ్, గడ్డం రవీందర్, రాజేశం, రమేశ్, నాయకులు సంపత్, సమ్మయ్య, జూనియర్ తిరుపతి, చంద్రయ్య, వైకుంఠం, గణపతి, దాసరి బాబురావు, కైత స్వామి, చందర్, దుంపల బాపు, అజీం, సంజీవ్, భిక్షపతి, శ్రీనివాస్ ఉన్నారు.

కాసిపేట : మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

రెబ్బెన : ఖైర్‌గూడ ఓసీపీ లో ఇన్‌చార్జి మేనేజర్ మధుసూదన్‌కు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

బెల్లంపల్లి : శాంతిఖని గనిపై నల్లబాడ్జీలతో కార్మికుల నిరసన


మందమర్రి : కేకే5 గని మేనేజర్ అల్లాఉద్దీన్‌కు వినతి పత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, జూలై 1 :బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లిలో అన్ని శాఖల సమన్వయంతో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాలకార్మికులు, భిక్షాటన చేసే పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగిస్తామని, లేదా స్టేట్ హోమ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. చిన్న పిల్లలతో వెట్టి చాకిరీ చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల కార్మికులు కనిపిస్తే 1098, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. మంచిర్యాల -9848815120, జైపూర్ -94411 22702, బెల్లంపల్లి -9490435081 సబ్ డివిజన్ల ఇన్‌చార్జి ఎస్ఐ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే కేసులు

ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు

మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 1 : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు పేర్కొన్నారు. సోమవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రెండు బృందాలు బాల కార్మికులను గుర్తించి బడుల్లో చేర్పిస్తాయన్నారు. పిల్లలతో వెట్టి చాకిరీ చేయించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ , సీడబ్ల్యూసీ మెంబర్లు సమీరుల్లా ఖాన్, దశరథ్, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్ బాబు, డీసీపీవో మహేశ్, డీసీఆర్బీ సీఐ రమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

మూడేళ్ల పాపపై లైంగిక దాడి!

- డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో విచారణ
- యువకుడికి రిమాండ్

సిర్పూర్(టీ), జూలై 1 : వెంకట్రావ్‌పేట్ గ్రామంలో ఓ మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సోమవారం విచారణ ప్రారంభించారు. వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన యువకుడు బుడే రాజేందర్ ఆదివారం(జూన్ 30) మధ్యాహ్నం ఆరుబయట ఆడుకుంటున్న తన కూతురును ఇంటికి ఎత్తుకెళ్లి లైంగిక దాడి చేశాడని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రాజేందర్‌ను అదుపులోకి దర్యాప్తు చేస్తున్నారు. సిర్పూర్(టీ) కోర్టులో హాజరుపరుచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు